క్లుప్తంగా

విద్యార్థులకు గ్లాసుల పంపిణీ



ప్రత్తిపాడు: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు అదనపు పోషకాహారంగా రాష్ట్ర ప్రభుత్వం రాగిజావను అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చిన్నారులు రాగి జావను తాగేందుకు గాను ప్రభుత్వం నాణ్యమైన గ్లాసుల్ని కూడా పాఠశాలలకు సరఫరా చేసింది. వీటిని గురువారం వట్టిచెరుకూరు మండలం సీఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేశారు. పార్టీ నాయకుడు మురుకుట్ల వెంకట సురేంద్ర ముఖ్య అతిథిగా హాజరై గ్లాసుల్ని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్రియ విద్యాలయంలో మ్యూజిక్ వర్క్‌షాప్

గుంటూరు రూరల్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యత సాధించేందుకు కృషి చేస్తున్నామని నల్లపాడు కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ హనీ మెహతా తెలిపారు. గురువారం విద్యాలయంలో న్యూఢిల్లీకి చెందిన రూట్స్ టు రూట్స్ సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు మ్యూజిక్ వర్క్‌షాపును నిర్వహించారు. కార్యక్రమంలో 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచి విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రావీణ్యత కలిగి ఉండాలని తెలిపారు. సంగీత విద్యాంసురాలు జ్యోత్స్నలక్ష్మి విద్యార్థులకు సంగీతంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి, ఆనంద్, ఆంజనేయులు, స్వామి, ఫరూఖ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూనగర్: గుంటూరు అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టుల భర్తీకి అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని రజక కాలనీ, గోరంట్ల, నెహ్రూనగర్, గోరంట్ల ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్త, వసంతరాయపురం, ఆర్టీసీ కాలనీ, బోసుబొమ్మ, రాజరాజేశ్వరి పురం, పెదపలకలూరు స్వర్ణాంధ్రనగర్, అంకిరెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకురాలు పోస్టులు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు అందజేయాలని ఆమె సూచించారు.

యువకుడి అదృశ్యం



గుంటూరు ఈస్ట్: యువకుడి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం 18వ లైనుకు చెందిన కె.సింగారెడ్డి కుమారుడు వెంకటరెడ్డి లోన్ యాప్‌లో అప్పు తీసుకున్నాడు. దాన్ని ఇచ్చిన వారు తీర్చమంటూ వేధించడంతో ఆత్మహత్యాయత్నం చేశాడు. అయినా అప్పు ఇచ్చిన వారు వేధింపులు కొనసాగించడంతో గురువారం వెంకటరెడ్డి ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఈ మేరకు తండ్రి సింగారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831336 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చీటి పాట డబ్బులు ఇవ్వకుండా మోసం

చీటి పాట డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పండరీపురానికి చెందిన బి. రాఘవేంద్రరావు అరండల్‌పేటకు చెందిన సుబ్బారావు వద్ద రూ. 10లక్షలు, రూ. ఐదు లక్షల చీటి పాటలు వేశాడు. రూ. 10 లక్షల చీటి పాట పాడాడు. అయితే, సుబ్బారావు డబ్బులు ఇవ్వకుండా కాలం వెళ్లదీస్తున్నాడు. మోసం పోయినట్లు గుర్తించిన బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాసరచన పోటీల్లో టీజేపీఎస్ విద్యార్థి సత్తా



గుంటూరు ఎడ్యుకేషన్: హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహించిన ఏఎన్‌యూ అంతర్ కళాశాలల వ్యాసరచన పోటీల్లో టీజేపీఎస్ డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థి పి. గౌతమ్ ద్వితీయ బహుమతి పొందినట్లు ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు ఇటువంటి పోటీల ద్వారా మెరుగుపడటంతో పాటు, మేధాశక్తి అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు వైసీహెచ్ మణి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి గౌతమ్‌ను కళాశాల కరస్పాండెంట్ తెల్లాకుల శ్రీనివాసబాబు అభినందించారు.

అసైన్డ్ భూమిలో ఆగని అక్రమ క్వారీయింగ్

- అధికారుల సహకారంతో యథేచ్ఛగా తవ్వకాలు
- ఉన్నతాధికారులకు వీరనాయకునిపాలెం గ్రామస్తుల ఫిర్యాదు



క్వారీయింగ్ చేస్తున్న పొక్లెయినర్

వీరనాయకునిపాలెం(చేబ్రోలు): మండలంలోని వీరనాయకునిపాలెంలో దళితులకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూమిలో అక్రమ క్వారీయింగ్‌కు పాల్పడుతున్నట్లు గురువారం గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. రెండు నెలల కిందట మైనింగ్, విజిలెన్స్, రెవెన్యూ అధికారుల బృందాలు దాడులు చేసి కేసులు నమోదు చేయడంతో పాటు యంత్రాల్ని సీజ్ చేశాయి. అయితే, వారం రోజులుగా అక్రమార్కులు స్థానిక అధికారుల సహకారంతో యథేచ్ఛగా అసైన్డ్ భూమిలో అక్రమ క్వారీయింగ్ చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెం గ్రామానికి చెందిన 60మంది నిరుపేద దళితులకు 30 ఎకరాల సాగు భూమిని 1993లో ప్రభుత్వం అందించింది. సర్వే నంబరు 494, 495, 498, 499, 501, 370, 371, 374 తదితర నంబర్లలో ఒక్కొక్కరికీ అర ఎకరం చొప్పున పంపిణీ చేసింది. ఈ భూమిని కొంతమంది స్వాధీనం చేసుకొని వాటిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ క్వారీయింగ్ చేస్తున్నారు. మైనింగ్, విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తున్నా, వారి కళ్లు కప్పి అక్రమాలకు పాల్పడుతున్నారు. అక్రమ క్వారీయింగ్ జరగకుండా జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు ఈ ప్రాంతంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా 50 నుంచి 60 అడుగుల లోతున్న ప్రాంతాల్లో సైతం యంత్రాల సహాయంతో గ్రావెల్‌ను తరలిస్తున్నారు. దీనిపై రెవెన్యూ, స్థానిక అధికారులు స్పందించకపోవడంతో గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

రాష్ట్ర ప్రజల నమ్మకం జగనన్నే...



వెనిగండ్లలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ప్రచారం



ఉప్పలపాడులో ఎంపీటీసీ సభ్యురాలు దంతాల శివపార్వతి తదితరుల ప్రచారం

గుంటూరు రూరల్: రాష్ట్ర ప్రజలంతా జగనన్ననే నమ్ముతున్నారని.. ఆయన వెంటే ఉన్నారని ఇన్‌కం టాక్స్ మాజీ కమిషనర్ మేకతోటి దయాసాగర్ తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గం 46వ డివిజన్‌లో గురువారం ఇంచార్జి ఆరిక శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలోఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దయాసాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని తెలిపారు. అమ్మ కడుపులోని శిశువు నుంచి అవ్వాతాతల వరకూ సంక్షేమ పథకాల్ని వారి ఇంటి వద్దకే అందిస్తున్న ఘనత మన జగనన్నకే దక్కిందని చెప్పారు. డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల్ని వివరించారు. వారి సమస్యల్ని తెలుసుకుని వాటి పరిష్కారాల్ని చూపారు. ఇంటి యజమానులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి అందించిన సంక్షేమ పథకాలు, వారి అభిప్రాయాల్ని సేకరించారు. వారి అనుమతితో ఇళ్లకు, సెల్‌ఫోన్లకు స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో 47వ డివిజన్ ఇంచార్జి జల్లేపల్లి వేణుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

నిమ్మగడ్డవారిపాలెం (ప్రత్తిపాడు): రాష్ట్రంలో సంక్షేమ పాలన నిర్విరామంగా సాగుతుందని మాజీ ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం నిమ్మగడ్డవారిపాలెం పంచాయతీలో గురువారం రాత్రి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిమ్మగడ్డ జనార్దన్, నిమ్మగడ్డ సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దయాసాగర్ స్థానిక నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లు అతికించారు. చంద్రబాబునాయుడు పాలనకు, వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాల్ని ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా దయాసాగర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ పాలనలో ప్రతి ఇంటా సంతోషం కనిపిస్తోందని తెలిపారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయ దుందుభి మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు విప్పాల కృష్ణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ వి. లక్ష్మారెడ్డి, మండల మాజీ కన్వీనర్ గట్టు విజయ్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఓంప్రకాష్ రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ బాపతు వెంకటరమణ, పార్టీ నాయకులు చెంచు రామారావు, వెంకటేశ్వరరెడ్డి, పరమారెడ్డి, గోవిందరెడ్డి, మురళి పాల్గొన్నారు.

ఇంటింటికీ ప్రచారం

పెదకాకాని: గడప గడపలోనూ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. పెదకాకాని మండలంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగిస్తున్నారు. మండలంలోని ఉప్పలపాడు, పెదకాకాని, వెనిగండ్ల గ్రామాల్లో గురువారం నేతలు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వివరించారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న సేవలు, మేలు గురించి ప్రజలకు తెలియజేశారు. ఇంటి యజమానుల అనుమతితో డోర్ స్టిక్కర్లను అంటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిపై ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐబీఈఏ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న క్రాంతి, కిశోర్‌కుమార్, బాషా తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం(ఏఐబీఈఏ) ఆవిర్భావ దినోత్సవాన్ని మార్కెట్ సెంటర్‌లోని హిందూ కాలేజీ వద్ద గల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవరణలో గురువారం నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ ఇండియా యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ క్రాంతి సంఘం జెండాను ఆవిష్కరించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జిల్లా సలహాదారుడు పి.కిశోర్‌కుమార్ మాట్లాడుతూ నాడు బ్యాంకు ఉద్యోగ నాయకులు పర్వానా, ప్రభాత్ కార్ వంటి త్యాగాలు, పోరాటాల ఫలితంగా అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం(ఏఐబీఈఏ) ఏర్పాటైందని తెలిపారు. నాడు బ్యాంకింగ్ వ్యవస్థ మొత్తం ప్రైవేటు రంగంలో ఉండటం వల్ల సిబ్బందికి ఉద్యోగ, వేతన భద్రత, సమంజసమైన సర్వీసు నిబంధనలు లేకపోవడం వల్ల వారి జీవితాలు అగమ్యగోచరంగా ఉండేవని గుర్తుచేశారు. వారంలో ఏడు రోజులు పని దినాలుగా ఉండేవని, అత్యవసర పరిస్థితుల్లో కూడా సెలవులు ఇవ్వని దుర్భర పరిస్థితి ఉండేదని చెప్పారు. బ్యాంకుల లాభాలన్నీ ప్రైవేటు బ్యాంకుల యాజమాన్యాలకే దక్కేవని తెలిపారు. ప్రభుత్వానికి గానీ, సామాన్య ప్రజలకు ఏ విధంగానూ ఉపయోగపడేవని కావని పేర్కొన్నారు. ఏఐబీఈఏ ఆవిర్భావం తర్వాత అనేక పోరాటాల ఫలితంగా ఉద్యోగుల వేతన సవరణ, సెలవులు, సర్వీసు నిబంధనలు, ఉద్యోగ భద్రత లభించినట్లు చెప్పారు. బ్యాంకు ఉద్యోగుల సమస్యలపైనే కాకుండా అసంఘటిత రంగంలోని కార్మికుల సమస్యలపై, ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక ప్రభుత్వ విధానాలపై కూడా ప్రజా సంఘాలతో కలసి అనేక ఉద్యమాలు నిర్మించినట్లు తెలిపారు. బ్యాంకుల జాతీయకరణ ఉద్యమంలో ప్రధానపాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఇప్పటికీ బ్యాంకుల్లో ఉద్దేశపూర్వకంగా రుణాల ఎగవేతదారుల్ని కఠినంగా శిక్షించాలని, వారి ప్రైవేటు ఆస్తుల్ని జప్తు చేయాలని కోరుతూ ఉద్యమాలకు పిలుపునిస్తూనే ఉందని గుర్తు చేశారు. రాబోవు రోజుల్లో బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలపై అన్ని ప్రజా ప్రగతిశీల సంఘాలతో కలసి పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాషా, షరీఫ్, పృథ్వీ, నాగేందర్, పావని,శివ పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో ఉచిత దంత వైద్య శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం హ్యాపీ డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ పి. రీనా, డాక్టర్ రేష్మ ఉద్యోగులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో దంత వైద్యశాల మేనేజర్ బి. కళ్యాణ్, కె.దేవి, అంజి నాయక్‌తో పాటు గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు కె. ఝాన్సీలక్ష్మి, ఎం. సీతారామయ్య పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశ పరీక్షకు గానూ ఈనెల 17 నుంచి నల్లపాడులోని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తాళ్లూరి శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 10న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు వసతి సౌకర్యం కూడా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కోచింగ్‌కు సంబంధించిన మెటీరియల్ ఇంగ్లిష్, తెలుగు మీడియంలలో ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నైపుణ్యవంతులైన మేనేజర్లుగా ఎదగాలి



ఆచార్య శివరామప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎస్వీ రమణ, అధ్యాపక బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులంతా నైపుణ్యవంతులైన మార్కెటింగ్ మేనేజర్లుగా ఎదగాలని ఏఎన్‌యూ వాణిజ్యశాస్త్ర డీన్ ఆచార్య ఆర్. శివరామప్రసాద్ సూచించారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో గురువారం ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ''స్పర్థ ది మేనేజ్‌మెంట్ ఫెస్ట్'' పేరుతో రెండు రోజుల పాటు జరిగే పోటీల్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివరామప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో భావ వ్యక్తీకరణ నైపుణ్యాల్ని పెంపొందించడంలో ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయని తెలిపారు. విద్యార్థి దశలో ప్రతి ఒక్కరిలో కొన్ని బలహీనతలు ఉంటాయని, వాటిని బలమైన అంశాలుగా మార్చుకునేందుకు భావవ్యక్తీకరణ ఒక సోపానమని చెప్పారు. ఎవరైతే సక్రకమైన భావ వ్యక్తీకరణ కలిగి ఉంటారో వారు విజయ సోపానం వైపు పయనిస్తారంటూ పలువురు ప్రముఖుల జీవితాల్ని ఉదహరించారు. హైదరాబాద్‌కు చెందిన మెరిల్ ఎండో సర్జరీ సేల్స్ మేనేజర్ ప్రహ్లాద పూజారి మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాన్ని సాధించేందుకు నాయకత్వ, బృందంతో కలసి పని చేయడం, క్రమశిక్షణ, సమయపాలన ప్రధానమైన అంశాలపై పట్టు సాధిస్తే ఉద్యోగాల్ని సాధించగలరని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాల్ని వెలికి తీసి, మార్కెట్ రంగంలో నిపుణులుగా తీర్చిదిద్దేందుకు స్పర్థ పేరుతో ఏటా పోటీల్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మొదటి రోజు విద్యార్థులకు మాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్, పోస్టర్ ప్రజెంటేషన్, బిజినెస్ క్విజ్ పోటీల్ని నిర్వహించగా, శుక్రవారం మార్కెట్ మేకర్స్ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, స్పర్థ 2023 కన్వీనర్ డాక్టర్ కె. లలిత, హెచ్ఓడీ వి. చక్రవర్తి, సహాయాచార్యులు డి. కళ్యాణి, సీహెచ్. వైష్ణవి, సీహెచ్. వేదవతి, బి. అనిత, ఎన్. మణికంఠ, వి. అభిలాష్ , విద్యార్థులు పాల్గొన్నారు.

27 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరం



బ్రోచర్లు విడుదల చేస్తున్న కృష్ణప్రసాద్, రథినీ చౌదరి, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఆహ్లాదం కలిగించే విధంగా డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో ఈనెల 27 నుంచి నెల రోజుల పాటు వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె. కృష్ణ ప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని స్కూల్లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని తరగతుల విద్యార్థులకు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, స్కేటింగ్, కరాటే, మెటీరియల్ ఆర్ట్స్, చెస్, వెస్ట్రన్ డ్యాన్స్, కుకింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మ్యూజిక్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. తరగతుల్లో పాల్గొనే ఆసక్తి గల వారు పాఠశాలలో నేరుగా సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 0863–2350392, 9948227362 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై. రథినీ చౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆకట్టుకున్న ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది, రైతులు

శలపాడు(చేబ్రోలు): వ్యవసాయ శాఖ ప్రకృతి వ్యవసాయ విభాగం, రైతు సాధికారత సంస్థ (ఆర్‌వైఎస్ఎస్) ఆధ్వర్యంలో చేబ్రోలు మండలం సుద్దపల్లి యూనిట్ పరిధిలోని శలపాడులో గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ 2023 –24 గురించి స్థానిక రైతులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా మండల నాచురల్ ఫామింగ్ మాస్టర్ ట్రైనర్ ఉమా మాట్లాడుతూ సుద్దపల్లి యూనిట్‌గా ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం జరుగుతుందన్నారు. రానున్న ఖరీఫ్ వ్యవసాయానికి ముందస్తు వర్షాలు పడే క్రమంలో రైతులు భూమిని దున్నుకొని సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం- సాగు విధానాలు- పాటించాల్సిన జాగ్రత్తలు, సూచనలు తదితర వ్యవసాయ పద్ధతులపై ర్యాలీలో రైతులకు అవగాహన కల్పించారు. మహిళా రైతుల భాగస్వామ్యంతో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై చర్చించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మన్నెం శిరీష, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వరరావు, మన్నెం వేణుగోపాలరావు, అభిలాష్, స్థానిక రైతులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, లీడర్లు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమ్యూనిటీ ఫెసిలిటేటర్ విజయలక్ష్మి

పెదకాకాని: బాలల హక్కుల్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని మండల కమ్యూనిటీ ఫెసిలిటేటర్ బి. విజయలక్ష్మి కోరారు. పెదకాకాని స్వర్ణపురికాలనీలో గురువారం గుడ్ షెపర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టులో భాగంగా బాలల రక్షణ, బాలల హక్కులపై చిన్నారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి చైల్డ్ క్లబ్ ముఖ్య ఉద్దేశాలు వివరించారు. గ్రామాల్లో బాలల హక్కుల సంరక్షణకు చైల్డ్ క్లబ్‌లను ఏర్పాటు చేసి సేవలందించనున్నట్లు చెప్పారు. బాలలు చదువుల్లోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ కె– అనూష, గుడ్ షెపర్డ్ సంస్థ ప్రతినిధులు డి. అనిల్ కుమార్, యస్. నాగమణి, చైల్డ్ క్లబ్ బాలలు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికీ సీఎం జగన్ భరోసా

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి



ట్రై సైకిల్స్ అందజేస్తున్న అయోధ్య రామిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, డొక్కా మాణిక్య వరప్రసాద్

పట్నంబజారు: ప్రతి పేదవాడికీ తానున్నానే భరోసా కల్పించిన మహోన్నత వ్యక్తిత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్ ఆధ్వర్యంలో దివ్యాంగ యాచకులకు ట్రైసైకిల్స్ పంపిణీ చేశారు. ఎంపీ అయోధ్య రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ముఖ్య అతిథులుగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల గుండెల్లో ధైర్యాన్ని నింపి.. ప్రతి నెలా పింఛన్ అందజేయడంతో పాటు వారికి అడుగడుగునా అన్నలా సీఎం జగన్ అండగా నిలబడుతున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమం కోసం అనుక్షణం పాటుడుతున్న వ్యక్తి సీఎం జగన్ అని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ భావజాలాన్ని పుణికిపుచ్చుకుని, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు నిరంతం పరితపిస్తున్నారని వివరించారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ కులమత, ప్రాంత, వర్గ, రాజకీయ భేదం లేకుండా సంక్షేమ సారథిగా చరిత్ర పుటల్లో నిలిచిపోయేలా సీఎం జగన్ పాలన చేస్తున్నారని పేర్కొన్నారు. మంచి చేస్తేనే ఓటు వేయండి అనే మంచి మనసున్న జననేత తిరిగి మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, పార్టీ అనుబంధ విభాగ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద సౌకర్యాల కల్పన: మేయర్



ఈద్గా పరిసర ప్రాంతాల్లో పర్యటిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా ప్రాంతాల్లో నగర పాలక సంస్థ నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల్ని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు ముస్లిం మత పెద్దలతో కలసి గురువారం పరిశీలించారు. నగరంపాలెం రోడ్డులోని రమేష్ హాస్పిటల్ వద్ద, పొన్నూరు రోడ్డులోని ముస్లిం కళాశాల ఈద్గాల వద్ద నగర పాలక సంస్థ నిర్వహిస్తున్న పనుల్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈద్గాలకు వచ్చే వారికి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, జంగిల్ క్లియరెన్స్, తాగు నీరు, టెంట్లు, కూలర్లు వంటివి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆక్రమణలు తొలగించి, ఈద్గాలకు రంగులు వేయడం పూర్తయిందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, కార్పొరేటర్లు మహమ్మద్ అబీద్ బాష, నాయకులు సాదు రాజేష్, గేదెల రమేష్, అయిశెట్టి శ్రీనివాస్, నగరపాలక డీఈఈలు రమేష్ బాబు, ఏఈలు, అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ కర్నూమ, సెక్రటరీ అబ్దుల్ సలాం, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ప్రయాణికుల దాహార్తి తీర్చడం అభినందనీయం



మినరల్ వాటర్ క్యాన్‌ను ప్రారంభించిన ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ , ఏఎస్పీ సుప్రజ

నగరంపాలెం: వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చడం కోసం ఆటోలో వాటర్ క్యాన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ కొనియాడారు. గుంటూరు రైల్వేస్టేషన్ (తూర్పు)లోని ఆటోస్టాండ్ ఆటో డ్రైవర్ మచ్చు దేవా తన ఆటోకు బిగించిన ఉచిత మినరల్ వాటర్ క్యాన్‌ను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సొంత ఖర్చులతో ప్రతి వేసవిలో ఆటో ద్వారా దేవా ఉచితంగా తాగునీరు అందించడం ప్రశంసనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ, ఎస్బీ సీఐ బి.నరసింహారావు, సీసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పెదకాకాని: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు నెహ్రూనగర్ రెండవ లైన్‌లో పమ్మిన రాజు కుటుంబం నివసిస్తోంది. ఈనెల 16న రాజు కూలీ పనులకు బైక్‌పై కంతేరు బయలు దేరాడు. మార్గంమధ్యలో పెదకాకాని వద్ద వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన రాజును స్థానికులు 108లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రాజు పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.